టమాట రైతు కుదేలు

- మార్కెట్‌లో అమాంతం పడిపోయిన ధర
- 30 కేజీల బాక్స్ రూ.60కు తగ్గిన వైనం
- దిగుబడి ఉన్నా.. ధర లేక నష్టాలు



పొలంలోనే టమాటను పారబోసిన దృశ్యం

బత్తలపల్లి: మార్కెట్‌లో ధర అమాంతం పడిపోవడంతో టమాట రైతులు కుదేలయ్యారు. కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ధరలు ఇలాగే కొనసాగితే పెట్టుబడి కూడా చేతికి అందక అప్పులు పాలు కావాల్సిందేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర్మవరం నియోజకవర్గంలోని ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, బత్తలపల్లి మండలాల్లో దాదాపు 2,625 ఎకరాలకుపైగానే సాగు చేశారు. సాగు ప్రారంభంలో ధరలు బాగా ఉన్నాయి. పంట చేతికి అందే సమయానికి ధరలు పూర్తిగా పడిపోయాయి. అనంతపురం, ముదిగుబ్బ మార్కెట్‌లో 30 కేజీల బాక్స్ ధర రూ.60 నుంచి రూ.100 లోపే ధర పలుకుతున్నట్లు రైతులు తెలిపారు. దీంతో రవాణా ఖర్చులు, పెట్టుబడులు కూడా చేతికి అందేలా కనిపించడంలేదని రైతులు వాపోతున్నారు.

ఖర్చు తడిసి మోపెడు..

టమాట రైతులకు ఖర్చు తడిసి మోపెడవుతోంది. బత్తలపల్లి నుంచి అనంతపురం, ముదిగుబ్బకు బాక్స్‌కు రూ.20 ఆటో చార్జీలు, మార్కెట్ దగ్గర హమాలీ కూలీ, కమీషన్ అంతా కలిపి బాక్స్‌కు మరో రూ.20 పడుతుంది. మొత్తం ఒక బాక్స్‌కు రూ.40లు పోగా రైతు చేతికి బాక్స్ అమ్మితే రూ.20 నుంచి 40లు అందుతుంది. ఒక ఎకరాలో టమాట పంటను సాగు చేయాలంటే అన్ని ఖర్చులు కలిపి దాదాపు రూ.50 వేల నుంచి రూ.55 వేల వరకు ఖర్చు అవుతుంది.

తోపుడు బండ్లు, వ్యాపారుల వద్ద...

ఇదే కూరగాయల మార్కెట్‌కు గానీ, తోపుడు బండ్లు, ఆటోల్లో మాత్రం అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నాయి. మార్కెట్‌లో కిలో రూ.20 అమ్ముతున్నారు. తోపుడు బండ్లు, ఆటోలలో మాత్రం మూడు కిలోలు కలిపి రూ.40 నుంచి రూ.50 వరకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. అదే పెట్టుబడులు పెట్టి, పంటను పండించిన రైతు మాత్రం కిలో రూ.3 కూడా ధర దక్కడం లేదు. ఇదే రైతు మార్కెట్‌కు వెళ్లితే మాత్రం అధిక ధరలకు కొనాల్సి వస్తోంది.

ధర్మవరం నియోజకవర్గంలో టమాట సాగు వివరాలు

మండలం	పంట సాగు (ఎకరాల్లో)
ధర్మవరం	730
బత్తలపల్లి	850
తాడిమర్రి	45
ముదిగుబ్బ	1,000

దిగుబడి ఉన్నా ధరే లేదు..



నేను ఏడు ఎకరాల్లో టమాట సాగు చేశా. పంట సాగుకు రూ.8 లక్షలు వరకు పెట్టుబడి పెట్టా. దాదాపు రూ.6 లక్షలు వరకు చేతికి వచ్చింది. ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. కోత కూలీలకు రూ.250 నుంచి రూ.300 వరకు ఇవ్వాలి. అనంతపురం మార్కెట్‌లో అమ్మితే కూలీలకు ఇచ్చే డబ్బు కూడా రాలేదు.
–నారాయణస్వామి, విశ్వనాథపురం, బత్తలపల్లి మండలం

ప్రభుత్వం ఆదుకోవాలి



ఏటా పంటలు సాగు చేసి రైతులు నష్టపోతూనే ఉన్నారు. ప్రస్తుతం టమోటా పంట సాగు చేసిన రైతులు తీవ్రంగానే నష్టపోతున్నారు. నేను మూడు ఎకరాల్లో టమోటా సాగు చేశాను. రూ.1.50 లక్ష వరకు పెట్టుబడి అయింది. పంట దిగుబడి ఆశాజనకంగానే ఉంది. గిట్టుబాటు ధరే లేక నష్టపోతున్నాం. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.
–వరిమడుగు ప్రభాకర్‌రెడ్డి, గుమ్మళ్లకుంట

గిట్టుబాటు ధర కల్పించాలి



అప్పుచేసి ఎకరా భూమిలో టమాట సాగు చేశాను. ఎన్నడూ ఊహించని విధంగా దిగుబడి వచ్చింది. అయితే ధర లేకపోవడంతో అప్పులు పాలవుతున్నాం. అన్ని ఖర్చులు పోనూ రైతులకు చిల్లిగవ్వ కూడా మిగలలేదు. కాయలను పెరికేకి వచ్చిన కూలీలకు కూడా డబ్బు రావడం లేదు. ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి.
–వరిమడుగు నాగేంద్రరెడ్డి, రైతు, గుమ్మళ్లకుంట

క్లుప్తంగా

అర్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని పేదలతో కలిసి శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీఎం చంద్రబాబు చెప్పిన విధంగా పట్టణాల్లోని నిరుపేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలాలను వెంటనే మంజూరు చేయాలన్నారు. గత 8 నెలల నుంచి ఇంటి స్థలాలపై ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. అనంతరం తహసీల్దార్ అనుపమకు వినతి పత్రం అందజేశారు. సీపీఐ నియోజక వర్గ ఇన్‌చార్జ్ ఆంజనేయులు, పట్టణ కార్యదర్శి వినోద్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు జయలక్ష్మి, సీపీఐ పట్టణ నాయకులు బాషా, గంగాధర్, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

19న కంటి ఆపరేషన్ల శిబిరం



కరపత్రాలు విడుదల చేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 19న ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరం నిర్వహించనున్నామని రోటరీక్లబ్ అధ్యక్షులు జయసింహ తెలిపారు. స్థానిక సాంస్కృతిక మండలిలో శుక్రవారం రోటరీక్లబ్ సభ్యులు శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంగళూరులోని శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులతో ఉచితంగా కంటి పరీక్షలు చేయించి అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామన్నారు. రోటరీక్లబ్ సభ్యులు నాగభూషణ, శివయ్య, సత్రసాల ప్రసన్నకుమార్, కొండయ్య, గట్టు హరినాథ్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



తాడిమర్రిలో నీటితొట్టెను పరిశీలిస్తున్న ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు

తాడిమర్రి: పెద్దకోట్ల, తాడిమర్రి, పిన్నదరి, నార్శింపల్లి, ఎం.అగ్రహారం, చిన్నచిగుళ్లరేవు, పెద్దకోట్ల, చిల్లకొండయ్యపల్లి, దాడితోట, చిల్లవారిపల్లి, రామాపురం తదితర గ్రామాల్లో వైద్య, ఆరోగ్య సిబ్బంది పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటా పర్యటిస్తూ నీటితొట్టెలు, పగిలిన కుండలు, పాతటైర్లు, చిప్పల్లో ఉన్న నీటిని పారబోయించారు. మురుగునీటి గుంతలను గుర్తించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత లోపిస్తే దోమలు ప్రబలి విషజ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నా. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు కోమలి, కృష్ణమ్మ, లక్ష్మీకాంతం, సుగుణ, ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్‌రెడ్డి, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ రెడ్డి సంఘం అధ్యక్షుడిగా మంజునాథరెడ్డి



నియామక ఉత్తర్వులు అందిస్తున్న సంజీవరెడ్డి

పుట్టపర్తి అర్బన్: రాయలసీమ రెడ్డి సంఘం అధ్యక్షుడిగా కొత్తచెరువు మండలం దంట్లపల్లికి చెందిన మంజునాథరెడ్డిని నియమించినట్లు ఆలిండియా రెడ్డి సంఘం అధ్యక్షుడు తలమర్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం మంజునాథరెడ్డికి నియామక ఉత్తర్వులను అందజేశారు. రెడ్డి కులంలోని పేదలను ఆదుకుంటామని, పేద విద్యార్థులకు తగినంత సాయం చేయడానికి ప్రయత్నిస్తామని వారు పేర్కొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ముదిగుబ్బ: పూజారి తండా పాఠశాల విద్యార్థులకు, అంగన్‌వాడీ చిన్నారులకు శుక్రవారం ఎంఈఓ గోపాల్‌నాయక్ విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ధర్మవరం మండలానికి చెందిన పాలెం జనార్దన్ మనవడు అద్వైత్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన విద్యా సామగ్రిని అందజేసినట్లు ఎంఈఓ తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం ఈశ్వరయ్య, టీచర్ వెంకటేష్ నాయక్, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మీబాయి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్మవరం అర్బన్: ధర్మవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, హెల్పర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ లక్ష్మి శుక్రవారం తెలిపారు. ధర్మవరం రాజేంద్రనగర్-4(ఓసీ), రామ్‌నగర్-3(ఎస్టీ) అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు, సంజయ్‌నగర్, దుర్గానగర్-1(బీసీ-ఈ), రామ్‌నగర్-3(బీసీ-డి), రామ్‌నగర్-7(ఓసీ), మల్లేనిపల్లి(ఎస్సీ), సి.బత్తలపల్లి(ఎస్సీ)లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పదో తరగతి పాసై, గతేడాది జూలై 1నాటికి 21 నుంచి 35 ఏళ్లలోపున్న వారు అర్హులన్నారు. అభ్యర్థులు పంచాయతీ లేదా వార్డు పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హెచ్‌ఎంపీ వైరస్‌పై జాగ్రత్తగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: హెచ్‌ఎంపీ వైరస్ పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని డాక్టర్ జ్యోత్స్న, సీహెచ్‌ఓ నగేష్ పేర్కొన్నారు. వెంకటగారిపల్లిలో వైద్య ఆరోగ్య సిబ్బంది వైరస్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. తుమ్ములు, దగ్గినప్పుడు వెలువడే తుంపర్ల ద్వారా వ్యాధి వ్యాపిస్తుందన్నారు. ముక్కు, కళ్లు, నోటిని తాకిన వారికి చిన్న పిల్లలకు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి ఈ వైరస్ వెంటనే సోకుతుందన్నారు. ఇన్‌ఫెక్షన్ కలిగిన 3-6 రోజుల్లో లక్షణాలు బయటపడతాయన్నారు. అయితే ఈ వ్యాధితో ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. సర్పంచ్ లక్ష్మీదేవమ్మ, సూపర్‌వైజర్లు వెంకటరమణ, చంద్రకళ, సెక్రటరీ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిబ్రవరి 1,2 తేదీల్లో ఎంప్లాయీస్ షటిల్ టోర్నీ



కరపత్రాలను విడుదల చేస్తున్న ఆర్డీఓ మహేష్, న్యాయవాదులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కళాజ్యోతిలో ఫిబ్రవరి 1,2 తేదీల్లో ఎంప్లాయీస్ మెగా షటిల్ టోర్నీని నిర్వహించనున్నామని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్, న్యాయవాదులు ప్రవీణ్, నరసింహమూర్తి తెలిపారు. ఈ టోర్నీకి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆర్డీఓ మహేష్ చేతులమీదుగా విడుదల చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని కళాజ్యోతిలో నిర్వహించే ఎంప్లాయిస్ మెగా షటిల్ టోర్నమెంట్‌లో పాల్గొనాలనుకునే క్రీడాకారులు ఈనెల 25వతేదిలోపు తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. ఎంట్రీఫీజు రూ.600 చెల్లించాలని తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు, టోర్నీలో పాల్గొన్న ప్రతిఒక్కరికి జ్ఞాపికలు అందిస్తామన్నారు. వివరాలకు 9701213058, 8073459509, 8179774420 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కార్మికుల సమస్యలు తీర్చాలని రిలే దీక్షలు



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న సీఐటీయూ నాయకులు, మున్సిపల్ కార్మికులు

ధర్మవరం అర్బన్: మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు తీర్చాలని సీఐటీయూ మండల కన్వీనర్ జీవీ రమణ, కోకన్వీనర్లు అయూబ్‌ఖాన్, ఎల్.ఆదినారాయణ డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం సీఐటీయూ, మున్సిపల్ కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, జీఓ 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని, చనిపోయిన కార్మిక కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక జిల్లా అధ్యక్షుడు బొగ్గు నాగరాజు, పట్టణ కార్యదర్శి జయ, పారిశుద్ధ్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, పట్టణ కార్యదర్శి ముకుంద తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. లక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణం



ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు



చెన్నకేశవస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పుట్టపర్తి: కొత్తచెరువు మండలం చెన్నకేశవపురంలో చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారి కల్యాణం వైభవంగా సాగింది. ఆలయంలో తెల్లవారు జాము నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు ఉషారాణి చెన్నారెడ్డి ఆలయ ప్రాంగణంలో హోమం చేపట్టారు. ముక్కోటి ఏకాదశి పర్వదినం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో స్వామి వారిని ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్తలు వేలాది మంది భక్తులకు భోజన వసతి ఏర్పాటు చేశారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ షేక్ షంషాద్‌బేగం

ధర్మవరం: పట్టణంలోని కొత్తపేటలోనున్న ఉషోదయ పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలు ఉత్సాహంగా సాగాయి. పాఠశాల కరస్పాండెంట్ చాంద్‌బాషా ఆధ్వర్యంలో జరిగిన పోటీలను మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ షేక్ షంషాద్‌బేగం పర్యవేక్షించారు. గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చేతులమీదుగా పంపిణీ చేశారు. అనంతరం సంక్రాంతి గొప్పతనాన్ని విద్యార్థినులకు వివరించారు.

నేటి నుంచి నానా దర్గా ఉరుసు

కదిరి అర్బన్: పట్టణంలో నానాదర్గా ఉరుసు శనివారం నుంచి ప్రారంభం కానుంది. తొలిరోజు గంధం, 12న ఉరుసు ,13న జియారత్ కార్యక్రమాలు ఉంటాయని దర్గా కమిటీ ప్రెసిడెంట్ కేఎం బాషా,సెక్రటరీ ఖాదర్‌బాషా శుక్రవారం తెలిపారు.

ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు



ధర్మవరం లక్ష్మీ చెన్నకేశవాలయంలో ఉత్తర ద్వారంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



ధర్మవరంలో చెన్నకేశవస్వామి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు



పుట్టపర్తి మండలం వెంకటగారిపల్లిలో వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లోని ప్రముఖ ఆలయాల్లో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రముఖ ఆలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో తెల్లవారు జాము నుంచే ఉత్తర ద్వార దర్శనం ఏసుకున్నారు. ప్రధానంగా కదిరి ఖాద్రీశుడి ఆలయం, ధర్మవరం లక్ష్మీ చెన్నకేశస్వామి ఆలయంతో వైష్ణవాలయాల్లో స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. పలుచోట్ల అన్నదానం నిర్వహించారు.
–సాక్షి నెట్‌వర్క్



బత్తలపల్లి లక్ష్మీవెంకటేశ్వర ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



ధర్మవరం కొత్తపేటలో వెంకటేశ్వరస్వామి



తాడిమర్రిలో లక్ష్మీచెన్నకేశవస్వామి



కదిరి ఖాద్రీశుడి ఆలయంలో స్వామి దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు



నల్లమాడలో పూజలందుకున్న షిర్డీసాయిబాబా మూలవిరాట్



శ్రీవారి పల్లకీ మోస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



చెన్నేకొత్తపల్లి: లక్ష్మీ చెన్నకేశవస్వామి దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు



కనగానపల్లి: కోట కాలనీలో భక్తులకు అన్నదానం

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్‌కు గాయాలు

కదిరి అర్బన్: కాలేపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. కదిరి-మదనపల్లి జాతీయ రహదారిపై శుక్రవారం ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఆటో ఢీ కొనడంతో నల్లచెరువు మండలం పూలకుంటపల్లికి చెందిన ఆటోడ్రైవర్ హరీష్‌కు గాయాలయ్యాయి. స్థానికులు బాధితున్ని కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆకస్మిక తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ సీఈఓ వెంకట సుబ్బయ్య

కదిరి అర్బన్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకట సుబ్బయ్య శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. హౌస్ హోల్డ్ సర్వే, మిస్సింగ్ సిటిజన్ మ్యాపింగ్, బయోమెట్రిక్ అటెండెన్స్‌లను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు నమోదు చేయడంలో వెనుకబడి ఉన్నారని ఎంపీడీఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు వేసేలా చూడాలని ఆదేశించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కదిరి అర్బన్: రాచువారిపల్లి తండాకు చెందిన చిన్న రెడ్డెప్పనాయక్‌కు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శుక్రవారం సీఎంఆర్‌ఎఫ్(ముఖ్యమంత్రి సహాయ నిధి) చెక్కు అందజేశారు. వైద్యుల ఖర్చుల నిమిత్తం బాధితుడికి రూ.1,05,343 చెక్కు అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

అమడగూరు: నారాయణస్వామి మఠం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక ప్రాంతం, బిళ్లూరుకు చెందిన కుమ్మరి నరసింహులుకు తీవ్ర గాయాలయ్యాయి. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొనడంతో ప్రమాదం సంభవించినట్లు స్థానికులు తెలిపారు. కాగా ప్రమాదంలో గాయపడిన నరసింహులును బాగేపల్లికి తరలించారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

కదిరి అర్బన్: బాలప్పగారిపల్లితండా శివార్లలో శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అన్నపూర్ణ, ఎస్ఐ హరికృష్ణ నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా 600 లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం చేశారు.

మతి స్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

ముదిగుబ్బ: మండల కేంద్రంలో మతి స్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన శివ ప్రసాద్(44) కొన్నేళ్లుగా మతి స్థిమితం లేక వింతగా ప్రవర్తించేవాడు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య రుసాంతి, ఇద్దరు కుమారులున్నారు.